# Forum for Good Governance

Regd.No:653/2009

హైదరాబాదు
6-5-2024

L.No. FGG/SEC/REP/ 64 /2024

కమీషనర్
రాష్ట్ర ఎన్నికల సంఘం
తెలంగాణ రాష్ట్రం
హైదరాబాదు

అయ్యా !

తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగగా పార్లమెంటు ఎన్నికల తతంగం జూన్ 4తో ముగుస్తుంది. ఇక మిగిలింది స్థానిక సంస్థల ఎన్నికలు ముఖ్యంగా గ్రామ పంచాయితీ ఎన్నికలు గత 8 నెలల ముందుగా జరుగవలసి ఉండగా రకరకాల కారణాలతో జరుగలేదు. బహుశా జూలై, ఆగష్టు నెలలలో జరుగవచ్చు. తెలంగాణ రాష్ట్రంలోని చాలా గ్రామాలలో గ్రామాభివృద్ధి కమీటీలు, కుల సంఘాలు వంటి రాజ్యాంగేతర శక్తులు గత ఎన్నికలలో కొన్ని గ్రామాలలో సర్పంచ్ మరియు మెంబర్ల పదవులు వేలం పెట్టి ఏకగ్రీవ ఎన్నికలు జరిపించినారు. వేలంలో వచ్చిన డబ్బు గ్రామాభివృద్ధి పేరుతో ఖర్చు చేయడం జరిగింది. చాలా గ్రామాలలో ఇప్పటి నుంచే సమాలోచనలు జరుగుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలు పూర్తి అయిన తరువాత వేలం ద్వార ఏకగ్రీవ ఎన్నికలకు తెరలేస్తుంది. ఈ మధ్య గుజరాత్ మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో ఇద్దరు పార్లమెంటు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వార్తలు వచ్చాయి. అధికారపార్టీ వారు ఇతర పోటీదారులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని వారిని పోటీ నుంచి తప్పించినారని వినికిడి. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

2013వ సంవత్సరంలో సుప్రీమ్ కోర్టు పోలింగు పెంచే దిశలో పోటీదారుల పేరుల చివరన నోట (నన్ ఆఫ్ ది ఎబొవ్) కూడ ఉండాలని ఆదేశించింది. అయితే నోటాకు ఓట్లు వచ్చినా, రాకున్నా ఒరిగేది ఏమీలేదు. అయితే గ్రామస్థాయిలో లాలూచి ఏకగ్రీవ ఎన్నికలు ఆపడానికి నోటా కూడ ఒక అభ్యర్థి క్రింద పరిగణించాలని దానితో తప్పనిసరిగా ఎన్నికలు జరుగుతాయని మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ వంటి రాష్ట్రాలలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ స్థానిక ఎన్నికలలో నోటాను ఒక పిక్టీషియస్ (కల్పిత) అభ్యర్థిగా పరిగణించడం జరిగింది. దానితో

బలవంతపు ఏకగ్రీవ ఎన్నికలు ఆగిపోయినాయి. ఇచ్చట గమనించవలసిన విషయం ఓటరుకు ఎన్నికలలో ఓటు వేసే హక్కు రాజ్యాంగం కల్పించింది. ఏకగ్రీవ ఎన్నికలతో ఓటరు ఓటు వేసే హక్కు కోల్పోతాడు. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థ. ప్రతి ఓటరు ఓటు వేసే వీలు కల్పించడం కమీషన్ బాధ్యత.

వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని నోటాను ఒక ఫిక్టీషియస్ (కల్పిత) కాండిడేట్‌గా గుర్తిస్తూ ఏకగ్రీవులకు అవకాం లేకుండా ఓటరుకు ఓటు హక్కు కల్పించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ రాష్ట్ర ఎన్నికల కమీషన్‌ను కోరుతుంది.

భవదీయుడు

యం. పద్మనాభరెడ్డి

అధ్యక్షులు

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

# నోటాను అభ్యర్థిగా గుర్తించి ఏకగ్రీవాలను అడ్డుకోండి

**ఎన్నికల సంఘానికి ఎఫ్‌జీజీ విజ్ఞప్తి**

**హైదరాబాద్, వెలుగు :** గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ఎన్నికల్లో ఏకగ్రీవ ఎన్నికను అడ్డుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫోరం ఫర్ గుడ్ గవర్నన్స్(ఎఫ్‌జీజీ) విజ్ఞప్తి చేసింది. ఏకగ్రీవ ఎన్నికను అడ్డుకునేందుకు మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో అమలు అవుతున్న విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని కోరుతూ ఎన్నికల సంఘానికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి సోమవారం లెటర్ రాశారు. రాష్ట్రంలో గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేక చోట్ల బలవంతపు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయని తెలిపారు. దీని వల్ల ప్రజలు ఓటు వేసే హక్కును కోల్పోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఈసారి జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బలవంతపు ఏకగ్రీవాలకు ఇప్పట్నుంచే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో ఇలాంటి కుట్రలను అడ్డుకునేందుకు నోటాను కూడా అభ్యర్థిగా గుర్తిస్తున్నారని తెలిపారు. తెలంగాణలోనూ నోటాను ఒక అభ్యర్థిగా గుర్తించాలని, తద్వారా ప్రతి పంచాయతీలో ఎన్నికలు జరిగి, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేయాలని విజ్ఞప్తి చేశారు.

# 'నోటా'ను కల్పిత అభ్యర్థిగా పరిగణించాలి

- ఏకగ్రీవాలకు అవకాశమివ్వొద్దు
- ఈసీకి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ



దిశ, తెలంగాణ బ్యూరో : నోటాను ఒక ఫిక్టీషియస్ (కల్పిత) అభ్యర్థిగా గుర్తించి ఏకగ్రీవాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఫోరంఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం. పద్మనాభరెడ్డి కోరారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు లేఖ రాశారు. త్వరలో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల పదవులు వేలం వేసి ఏకగ్రీవ ఎన్నికలు జరిపించే ప్రమాదముందన్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటి నుంచే సమాలోచనలు జరుగుతున్నాయని తెలిపారు. పోలింగ్ పెంచే దిశలో పోటీదారుల పేర్ల చివరన నోటా కూడా ఉండాలని 2023లో సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. ఏకగ్రీవాలు ఆపడానికి మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో నోటాను ఒక ఫిక్టీషియస్ (కల్పిత) అభ్యర్థిగా పరిగణించారన్నారు. ఎన్నికల్లో ఓటు వేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ఏకగ్రీవ ఎన్నికలతో ఓటరు ఆ హక్కును కోల్పోతాడన్నారు.